# 4. ఇలయాన్‌కుడి మారనాయనారు

ఇలయాన్‌కుడి మారనాయనారు ఒక పంటకాపు. మారనార్ అతని పేరు. ఇల యాన్‌కుడి గ్రామవాసి. శివారాధన తత్పరుడు. శివభక్తులను సేవించేవాడు. శివభక్తుల ఇతోధిక సేవలలో పరమానంద భరితుడయ్యేవాడు. ఈ సాధనకు (మహేశ్వర భక్తార్చన, శివార్చన) మహేశ్వరపూజ అని అంటారు.

మహేశ్వర పూజ ఇలా వుంటుంది.

"శివభక్తుని విభూతి పుండ్రములతో, రుద్రాక్షలతో చూడగానే - ఆయననే సాక్షాత్తు శివుడుగా భావించి, లోనికి గౌరవ పురస్సరముగా ఆహ్వానించి, ఆయనకు సాష్టాంగపడి, ఆయన కరచరణాదులను కడిగి, ఆ చరణామృతమును తలపై జల్లుకొని, ఆయనను ఆసీనునిచేసి, పూలతో, దీపముతో, ధూపముతో, నైవేద్యముతో ఆయనను అర్చించి, మంచి తియ్యని మాటలాడి, ఆయనను తాము అర్చించుటకు అవకాశ మిచ్చినందులకు మహద్భాగ్యమని పొగడి, ఆయన తిరిగి వెళ్ళునప్పుడు ఆయనను కొంత దూరము వరకు సాగనంపివచ్చుట" -ఇదంతా "మహేశ్వరపూజ" అవుతుంది.

శివభక్తులకు భోజనమిడుటచే ఆత్మ పునీతమవుతుంది. దేవుని అనుగ్రహమునకు గృహస్తు పాత్రుడవుతాడు.

తిరువల్లువారు కురాల్ లో ఇట్లా చెప్పారు.

"అతిథి రాక కలరి యాతిధ్యమిచ్చెడి
వారి యింట లక్ష్మి వలచి నిలుచు."

నాయనారుకు అనంతైశ్వర్యమిచ్చాడు భగవంతుడు. నాయనారు మాత్రము " ఆ సంపద అంతా ఈశ్వరునిది. దానిని ఆయన భక్తులకే వినియోగించాలి" అనుకునేవాడు.

నాయనారు భక్తి తత్పరతకు ఈశ్వరుడు పరవశుడయ్యాడు. ఎన్ని అవాంతరాలు, బెడదలు వచ్చినా - నాయనారు తన ప్రవర్తనలో - తొణకడు, బెణకడు అని ప్రపంచానికి చూప దల్చాడు.

అంతే! నాయనారు ఆస్తి కరిగిపోయింది. నాయనారును సంపద వీడి పోయిందే కాని - అతని సద్గుణాలు అతనిని వీడలేదు.పైగా నాయనారుకు పరమశివునిమీద ప్రేమ, భక్తి బహుధా ఇనుమడించాయి. ఆస్తిని అమ్మవలసి వచ్చింది. మహేశ్వర భక్తులను సేవిం చుటకై, వారి సేవలకై తనను తానే అమ్ముకోవలసిన పరిస్థితి కూడ వచ్చింది. అయినా శివభక్తినుండి మరల లేదు.

ఒక రోజున కుంభవృష్టి కురుస్తోంది. నాయనారున్ను భార్యయున్ను పస్తున్నారు. ఎవరూ వారికి సాయము చేయలేదు. రాత్రి నిదురిద్దామని తలుపుకు గడియపెట్టాడు. నిదురపోబోతుండగా, ఎవరో తలుపు తట్టిన శబ్దము వినిపించింది. తలుపు తెరచిచూస్తే వర్షముతో తడుస్తూ ఒక శివభక్తుడు వాకిటి ముంగిట నిలబడి యున్నట్లు నాయనారు గమనించాడు. నాయనారు తక్షణమే ఆ ఆగంతకుని ఇంటిలోనికి తెచ్చి కట్టుకోటానికి పొడి బట్టలు ఇచ్చాడు. వచ్చినతనితో “స్వామీ కొద్దిసేపు విశ్రమించండి. ఈలోగా మీ ఆకలి తీర్చుటకు ఆహారము సమకూరుస్తాము” అని చెప్పి భార్యతో “ఈ ఆపదనుండి ఎట్లా గట్టె క్కాలి” అని వాపోయాడు. వెంటనే నాయనారు భార్య నాయనారును “పెరట్లో ఈ రోజు నే పాతిపెట్టిన ధాన్యపు గింజలను త్రవ్వి తీసికొని రండి” అన్నది. నాయనారుకు ఆసలహా నచ్చింది. అతివృష్టి మూలాన్ని ఆగింజలన్నీ తేలుతూ నీళ్లమీద వున్నాయి. అందుకని వాటిని బుట్టలో తేవీలయింది. వాటిని తెచ్చి భార్యకు ఇచ్చాడు. ఆమె వాటిని దంచి పెరట్లో వున్న ఆకుకూరలతో కలిపి పచనము చేసి అతిథికి మంచి భోజనము సమకూర్చింది.

నాయనారు చాల సంతోషించాడు. అతిథిని నిద్రలేపుటకు వెళ్లాడు. అక్కడ వెళ్లి చూడగా అతిథి అంతర్ధాన మైనట్లుగమనించాడు. తల ఎత్తి ఆకాశము వంక చూచాడు. పరమేశ్వరుడు అతిథిరూపంలో పార్వతీ దేవితో ప్రత్యక్షమయి దంపతుల మీద ఆశీర్వచ న అక్షతలు కుర్పించాడు.

పరమేశ్వరుడు నాయనారుతో “మీభక్తికి చాల సంతసించాను. నాలోకానికి వచ్చి అచ్చట శాశ్వతముగా యుండండి” అని వారిని వెంటనిడుకొని పోయెను.

****